అక్షరటుడే కథనానికి స్పందన



2



2

పెట్రోల్, డీజిల్‌పై పన్నులు ఎత్తివేయాలి

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com




## డీఆర్‌వో గీతకు ఘనసన్మానం

**అక్షరటుడే, ఇందూరు:** ఇటీవల జిల్లా రెవెన్యూ అధికారిణిగా గీత బాధ్యతలు స్వీకరించగా ఆమెను శనివారం టీఆర్ఈఎస్‌ఏ, టీజీపీవోఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జీపీవోలు తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు: సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఇటీవల డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారికి, అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం కారణంగా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ఆర్థికంగా సామాజికంగా వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం ఆరోగ్యపరంగా ప్రమాదకరంగా మారుతుందని.. చట్టపరంగానూ తీవ్రమైన నేరమని హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై పోలీసు శాఖ కఠినచర్యలు తీసుకుంటుందని వివరించారు. గతంలో కేసులు నమోదైన వ్యక్తులు తమ ప్రవర్తన మార్చుకుని సమాజంలో బాధ్యతాయుతంగా జీవించాలన్నారు. మళ్లీ ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటే పీడీయాక్ట్ లాంటి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదనపు డీసీపీ (ఏఆర్) రాంచందర్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఈగల్ టీం డీఎస్పీ ఎం.సోమనాథం, హోంగార్డ్ ఏసీపీ కె.దీపక్ చంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్, సౌత్ రూరల్ సీఐ ఎన్ సురేష్ కుమార్, నార్త్ రూరల్ సీఐ బి .శ్రీనివాస్, డిచ్‌పల్లి సీఐ కె.వినోద్, ధర్పల్లి సీఐ భిక్షపతి పాల్గొన్నారు.

## నకిలీ సర్టిఫికెట్, అక్రమ కల్లు లైసెన్స్ ఆరోపణలపై ఇద్దరికి నోటీసులు



**అక్షరటుడే, కామారెడ్డి:** నకిలీ సర్టిఫికెట్ సమర్పించి అక్రమంగా టీఎఫ్టీ లైసెన్స్ పొందారనే ఫిర్యాదుపై విచారణ జరిపేందుకు జిల్లా ఎక్సైజ్ శాఖ సిద్ధమైంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టులో దాఖలైన కేసులో ఏప్రిల్‌లో వెలువడిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి హన్మంత్ రావు తెలిపారు. ఈ మేరకు తాడ్వాయి మండలం కరడ్‌పల్లి గ్రామానికి చెందిన కె.స్వామిగౌడ్, ఎస్.సంపత్ కుమార్‌లకు నోటీసులు అందజేశారు. వీరిద్దరూ ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డి కలెక్టరేట్‌లోని జిల్లా ఎక్సైజ్ అధికారి ఛాంబర్‌లో జరిగే విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. తమ వాదనకు మద్దతుగా ఉన్న అన్ని సహాయక పత్రాలను విచారణ సమయంలో సమర్పించాలని అధికారులు సూచించారు.

## చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో బాల్‌భవన్ పాత్ర గొప్పది



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో బాల్‌భవన్ పాత్ర గొప్పదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. వేసవిలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు వారికి ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. బాల్‌భవన్‌లో శనివారం 'కళా వైభవం-కలర్స్ ఆఫ్ చైల్డ్ హుడ్' నిర్వహించగా కలెక్టర్, మేయర్ ఉమారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్.. చిన్నారులు తయారు చేసిన కళాకృతులు, గీసిన చిత్రాలను ఆసక్తితో తిలకించారు. చక్కటి పెయింటింగ్స్ గీసిన 7వ తరగతి విద్యార్థి సాయి రుధిర్ కళా నైపుణ్యాన్ని కలెక్టర్ మెచ్చుకుంటూ, చిన్నారికి బహుమతిని అందించి ప్రోత్సహించారు. పేరిణి, కోలాటం నృత్యాలతో అలరింపజేసిన చిన్నారులను, వెంట్రిలాక్విజంతో ఆకట్టుకున్న జాదూ యుగంధర్ రంగనాథ్‌ను కలెక్టర్ ప్రశంసించారు. మేయర్ ఉమారాణి మాట్లాడుతూ.. నేటి చదువులు ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉన్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లో బాల భవన్ ద్వారా అందిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలు చిన్నారులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, బాల్‌భవన్ సూపరింటెండెంట్ ఉమాబాల, మాజీ పర్యవేక్షకుడు ప్రభాకర్, రాఘవేందర్ పాల్గొన్నారు.



- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- ఇసుక, గుట్కా మాఫియాపై ఉక్కుపాదం
- వరుస దాడులతో దూకుడు

# 'చీతా'తో అక్రమార్కులకు వణుకు!



జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చీతా ఫోర్స్ పేరిట ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నిత్యం దాడులు చేస్తూ అక్రమ మైనింగ్, గుట్కా దందాపై ఉక్కుపాదం మోపుతున్నాయి. చీతా ఫోర్స్ మెరుపు దాడులతో అక్రమార్కులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ తాము దొరికిపోతామోనని భయపడుతున్నారు.

- అక్షరటుడే, భీమ్‌గల్

నిజామాబాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన చీతా ఫోర్స్, సీసీ ఎస్ బృందాలు వరుస దాడులతో అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయి. కొద్ది రోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ ప్రత్యేక బృందాలు జరిపిన మెరుపు దాడుల్లో లక్షలాది రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల బోధన్ పట్టణంలో చీతా ఫోర్స్ బృందం అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి భారీ గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించి సుమారు రూ. 30 లక్షల విలువైన నిషేధిత గుట్కా బస్తాలను స్వాధీనం చేసుకుంది.

### ఇసుక మాఫియాపై..

నిజామాబాద్ జిల్లాలో నదులు, వాగుల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ముఠాల పనిని పడుతోంది. ఆర్మూర్, మోర్తాడ్ పరిసర ప్రాంతాల్లో చీతా ఫోర్స్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రెండు భారీ లారీలను సీజ్ చేశారు. ఎటువంటి మైనింగ్ పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా భీమ్‌గల్ మండలంలోని గోనుగొప్పుల ప్రాంతంలో అర్ధరాత్రి వేళల్లో సాగుతున్న ఇసుక దందాను సైతం ఈ బృందాలు అడ్డుకుని ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్ చేశాయి. దీంతో అక్రమార్కుల్లో వణుకు పుడుతోంది.

### ధర్పల్లి మండలంలో..

ధర్పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామం పెద్ద వాగు ప్రాంతంలో చీతా ఫోర్స్ సిబ్బంది ఆకస్మిక దాడులు చేశారు. అనుమతులు లేకుండా మొరం అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న వాహనాలను గుర్తించారు. అనంతరం 2 జేసీబీ యంత్రాలు, మొరం రవాణాకు వినియోగిస్తున్న 13 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో చీతా ఫోర్స్ దాడులు చేస్తోంది. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, మొరం తవ్వకాలపై చర్యలు చేపట్టింది. దీంతో ఇసుక మాఫియా ఆందోళన చెందుతోంది.

### ప్రశంసల జల్లు..


జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక రుగ్మతలపై పోరాడుతున్న చీతా ఫోర్స్ పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, క్షేత్రస్థాయిలో అక్రమాలను అడ్డుకుంటున్న పోలీసుల సమర్థతకు ఈ వరుస విజయాలు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. రాత్రి పగలు తేడా లేకుండా అటవీ ప్రాంతాల్లో, వాగుల వద్ద నిఘా పెంచి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో ఈ బృందాలు సఫలీకృతమవుతున్నాయనే చెప్పాలి. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## కేకేవై రహదారిపై అన్నదాతల ఆందోళన



**అక్షరటుడే, లింగంపేట:** ధాన్యం కొనుగోళ్లు చేసినప్పటికీ రైస్‌మిల్లులకు తరలించడంలో జాప్యాన్ని నిరసిస్తూ కేకేవై రహదారిపై రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా లింగంపేట మండలంలోని భవానీ పేట, జల్దిపల్లి, రాంపూర్ గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ.. కొనుగోళ్లు పూర్తయినప్పటికీ ధాన్యం ఇంకా కేంద్రాల్లోనే పేరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవానీపేట గ్రామంలో కేంద్రం ప్రారంభించి సుమారు నెలరోజులు పూర్తయి కొంత ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ 100కు పైగా ధాన్యం రాశులు అలాగే ఉండిపోయాయన్నారు. లారీలు రాకపోవడం తూకాలు సరిగ్గా జరగకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి మూడు రోజులకు ఒక లారీ వస్తుందని దానిలో 400 బస్తాలు నుంచి 500 బస్తాలు మాత్రమే వెళ్తున్నాయన్నారు. మిగిలిన ధాన్యం బస్తాలు కేంద్రంలోనే మగ్గుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించేందుకు రైతన్నలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని వారన్నారు. ఒకపక్క ధాన్యం కొనుగోలు జరగకపోవడం.. మరో పది రోజులు గడిస్తే వర్షాకాలం సీజన్ ప్రారంభం కానుండడంతో తమ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రైతులంటున్నారు. ధాన్యం ఎప్పుడు అమ్ముకోవాలని.. తిరిగి సాగుకు ఎప్పుడు సన్నద్ధం కావాలని ప్రశ్నిస్తున్నారు. ఘటనా స్థలానికి ఎస్సై దీపక్ కుమార్, ఆర్ఐ చేరుకొని రైతులను సముదాయించారు.

## మంత్రి తుమ్మలను కలిసిన వినయ్ రెడ్డి





**అక్షరటుడే, ఆర్మూర్:** హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి, మాక్లూర్ సొసైటీ ఛైర్మన్ బుర్రోల్ల అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. మాక్లూర్ సహకార సొసైటీ ధాన్యం కొనుగోళ్లలో నెంబర్‌వన్‌గా నిలిచిందని, రైతుల నుంచి పారదర్శకంగా, వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేయడం వల్లే ఈ గుర్తింపు వచ్చిందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేలా సొసైటీ ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వెల్మల్ గోపి, డీకంపల్లి సర్పంచ్ మచర్ల చిన్నయ్య, డైరెక్టర్స్ దయాకర్ రావు, కాశీనాథ్ రావు, గుండారం శేఖర్, మచర్ల రమేష్, ప్రసాద్ రావు, అశోక్ పాల్గొన్నారు.

## స.హ. చట్టం బోర్డుపై మారిన పేరు..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డుపై అధికారి పేరు మార్చకపోవడంపై 'అక్షరటుడే'లో కథనం ప్రచురించగా అధికారులు వెంటనే స్పందించారు. కథనం ప్రచురితమైన కొన్ని గంటల్లోనే స్పందించిన కార్యాలయ సిబ్బంది కొత్త కమిషనర్ పర్వతాలు పేరును బోర్డుపై రాయించారు.

– అక్షరటుడే, కామారెడ్డి




అక్షర టుడే కథనానికి స్పందన

## రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సర్కారు రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే విధంగా చర్యలు తీసుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రతిపక్షాలు బూటకపు మాటలతో రైతులను రెచ్చగొడుతూ రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయిస్తున్నాయన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌తో, అధికార యంత్రాంగంతో సీఎం సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 5.82లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. ఇప్పటికే రూ.1,181 కోట్లను రైతుల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిజామాబాద్ జిల్లానే అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయని నగేష్ రెడ్డి పేర్కొన్నారు. అందులో 50వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం వడ్లను కొనుగోలు చేశామని, దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేయడానికి కేంద్రం నుంచి అనుమతి రావాలని ఎందుకంటే దొడ్డు వడ్లను రైస్ మిల్లులకు బాయిల్డ్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో కేంద్రం ఆలస్యంగా అనుమతి ఇచ్చిందన్నారు. జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ వడ్లు కొనుగోలు చేయడానికి అనుమతి వస్తే ఇప్పటికే 50వేల టన్నుల దొడ్డు రకం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రాబోయే పది రోజుల్లో జిల్లాలో మిగిలిపోయిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు తెలిపారు. జిల్లాలో ఉన్న సుదర్శన్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, భూపతి రెడ్డి ఎల్లప్పుడు కలెక్టర్‌తో ప్రభుత్వ అధికారులతో సమీక్షలు జరుపుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి భక్తవత్సలం, జిల్లా ఉపాధ్యక్షుడు కొడపు శరత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రత్నాకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్, జిల్లా ఫిషరీస్ ఛైర్మన్ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండల కేంద్రంలోని ఏడో బెటాలియన్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 37వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. బెటాలియన్ కమాండెంట్ పి.సత్యనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ బోధనకు చిరునామా 'కేర్ కళాశాల': డైరెక్టర్ నరాల సుధాకర్




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో రెండు దశాబ్దాలకు పైగా అత్యుత్తమైన విద్యనందిస్తూ ప్రత్యేకత చాటుకుంటోంది కేర్ డిగ్రీ కళాశాల. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది వారిని ప్రయోజకులను చేసిన కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్త కోర్సులను అమలు చేస్తున్నట్లు కేర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి అవగాహన కల్పించేందుకు అధునాతన సాంకేతికతతో కూడిన స్మార్ట్ తరగతి గదులు, అన్ని సౌకర్యాలతో కూడిన సైన్స్, కంప్యూటర్ ల్యాబొరేటరీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయా కోర్సులకు సంబంధించిన పుస్తకాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా వేలల్లో పుస్తకాలు, జర్నల్స్, డిజిటల్ లైబ్రరీ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. క్రీడలకు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తూ.. అంతర్జాతీయస్థాయిలో క్రీడాకారులను తయారుచేసిన అనుభవం తమ కేర్ డిగ్రీ కళాశాలకు ఉందని తెలిపారు. వివరాలకు కేర్ డిగ్రీ కాలేజీ, తిలక్ గార్డెన్ కాంప్లెక్స్, స్టేషన్ రోడ్, నిజామాబాద్. 9949925676, 9951382993, 9949460640లలో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కళాశాల ఇన్‌ఛార్జీలు సందేశ్ సందీప్, కిరణ్ పాల్గొన్నారు.



- పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజలపై అదనపు భారం
- ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సిన సమయమిదే..
- జిల్లాలో ప్రజలపై.. రూ.18లక్షలకుపైగా అదనపు భారం

## మండుతున్న ఇంధన ధరలు..

# ప్రత్యామ్నాయమే మేలు..

పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యులకు భారంగా మారాయి. దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధరలను చమురు సంస్థలు పెంచడంతో వాహన దారులకు ఆర్థిక భారం పెరిగింది. వీటి ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు సైతం పెరిగే అవకాశాలున్నాయి. అలాగే వ్యవసాయ రంగంపై కూడా ప్రభావం పడనుంది. దీంతో ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ మార్గాల వైపు ఆలోచించాలని నిపుణులు పేర్కొంటున్నారు.

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

కామారెడ్డి జిల్లాలో లీటర్ పెట్రోల్ రూ.111.88, డీజిల్ రూ. 99.91కు చేరింది. జిల్లా కేంద్రంలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.108.62 ఉండగా.. రూ. 111.88కు పెరిగింది. అలాగే డీజిల్ లీటర్ ధర రూ. 96.65 నుంచి రూ. 99.91కు పెరిగింది. జిల్లాలో భారత్, ఇండియన్, హెచ్‌పీ, నయారా, రిలయన్స్ జియో కంపెనీలకు సంబంధించి 110 పెట్రోల్ బంకులున్నాయి. రోజూ సగటున పెట్రోల్ రెండు లక్షల లీటర్లు, డీజిల్ నాలుగు లక్షల లీటర్ల వరకు వినియోగిస్తున్నారు. దీంతో పెరిగిన ధరలతో ప్రజలపై రోజుకు రూ. 18 లక్షలపైగా భారం పడుతుందని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు.

### లక్షల్లో వాహనాలు

ప్రతి ఇంట్లో ఒకటి నుంచి రెండు బైక్‌లు ఉన్నాయి. పెరిగిన ఇంధన ధరలతో వారికి ఇబ్బందులు తప్పేటట్లుగా లేదు. కరోనా తర్వాత మధ్యతరగతి వారు సైతం కార్లు కూడా కొనుగోలు చేశారు. రవాణా శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో అన్ని రకాల వాహనాలు కలిపి 2.50 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో బైక్‌లు సుమారు 1,86,378 ఉన్నట్లు అంచనా. కాగా.. వాహనాల్లో అత్యధికం పెట్రోల్‌తో నడిచేవే. ఇటీవలి కాలంలో ఎలక్ట్రిక్ వాహనాలు, కార్ల వైపు జనం మొగ్గు చూపుతున్నా, వాటి వాటా తక్కువగానే ఉంది. అలాగే జిల్లాలో కార్లు 22,038, స్కూల్ బస్సులు 388, ఆటో రిక్షాలు, ట్యాక్సీ క్యాబ్‌లు, మోటార్ క్యాబ్‌లు ఉన్నాయి. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు జరుగుతున్నందున ఆటో రిక్షాలకు గిరాకీ తగ్గిపోయింది. అదనంగా ఇంధన ధరల పెంపుతో వారిపై అదనపు భారం పడుతోంది. వ్యవసాయంపైనా ప్రభావం పడుతుంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులకు డీజిల్ ధరల పెంపు మరింత భారంగా మారింది. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, వాటర్ పంప్‌సెట్లకు డీజిల్ వినియోగం ఎక్కువగా ఉంటుంది.

### నడక.. సైకిల్ తొక్కడం అలవాటు చేసుకుంటే..

సమీప దూరాలకు నడక లేదా సైకిల్ వాడటం అలవాటు చేసుకోవాలి. కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లేవారు కార్ పూలింగ్ విధానాన్ని పాటిస్తే ఇంధనంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. బైక్‌లు నడిపేవాళ్లు టైర్లలో సరైన గాలి ఒత్తిడి ఉంచుకోవడం, అనవసరంగా ఇంజిన్ ఆన్‌చేసి ఉంచకపోవడం, సడెన్ బ్రేక్‌లు, వేగంగా యాక్సిలరేట్ చేయడం తగ్గించడం ద్వారా 15 శాతం వరకు ఇంధనం ఆదా చేయవచ్చని మెకానిక్‌లు సూచిస్తున్నారు.

### ఎలక్ట్రిక్ వాహనాలు..

ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. ఈవీ వాహనాలపై రాయితీలు, రోడ్ ట్యాక్స్ మినహాయింపు వంటి సదుపాయాలు కల్పిస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు పెరుగుతున్నాయి. సోలార్ పవర్‌తో ఛార్జింగ్ చేసుకునే అవకాశం ఉన్నందున దీర్ఘకాలంలో ఆర్థికంగా లాభదాయకమని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఇళ్లల్లో ఎల్పీజీ వాడకంలో జాగ్రత్తలు పాటించడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ బస్సులు, మెట్రో, షేర్ ఆటోలను వినియోగించడం ద్వారా కుటుంబ బడ్జెట్‌పై ఇంధన భారం తగ్గుతుంది. రైతులు సైతం డీజిల్ వినియోగాన్ని తగ్గించుకునేందుకు సోలార్ పంప్‌సెట్లు, బయోగ్యాస్ వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు. పంటల సాగులో యంత్రాలను సమిష్టిగా వాడుకోవడం ద్వారా డీజిల్ ఖర్చును తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. ప్రజలందరూ చిన్న చిన్న మార్పులు చేసుకుంటే ఇంధన భారాన్ని కొంత మేర తగ్గించుకోవచ్చని, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రత్యామ్నాయం చూస్తేనే మేలు..

పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రజలు ఇంధన వినియోగాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణాను ఎక్కువగా వినియోగించుకోవడం ద్వారా నెలవారీ ఇంధన ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

## కల్యాణలక్ష్మి చెక్కు అందజేత



**అక్షరటుడే, లింగంపేట:** బానాపూర్ తండా పంచాయతీలో శనివారం బోడ పీరిబాయికి కల్యాణ లక్ష్మి చెక్కును సర్పంచ్ ధరావత్ పీర్ సింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరంలాంటిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవి సింగ్ వార్డు సభ్యులు శ్రీనివాస్, జీపీవో, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన కూరగాయల విక్రయాలకు చెక్.. 'అక్షరటుడే' కథనానికి స్పందన

**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డుపై కూరగాయల విక్రయానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. కామారెడ్డి పట్టణంలోని సీఎస్ఐ మైదానం ఎదురుగా రోడ్లపైనే కూరగాయాలు విక్రయిస్తున్నారు. ఈ విషయమై.. 'పట్టణంలో రాత్రిపూట రోడ్డు పక్కనే కూరగాయల విక్రయాలు' శీర్షికన ఈనెల 11 న 'అక్షరటుడే'లో కథనం ప్రచురితమైంది. దీంతో కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి స్పందించారు. తైబజార్ నిర్వహిస్తున్న వారితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రధాన రహదారి పక్కన కూరగాయలు విక్రయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రోడ్లపై విక్రయాలు నిలిపివేయాలని సూచించారు. సీఎస్ఐ మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుతో కూరగాయలు విక్రయించలేని పరిస్థితిని తైబజార్ నిర్వాహకులు ఛైర్‌పర్సన్‌కు చెప్పగా రోడ్డుకు ఎగ్జిబిషన్‌కు మధ్య చాలా స్థలం ఖాళీగా ఉంటుందన్నారు. అందులో కూరగాయలు విక్రయించేలా చూడాలని సూచించడంతో రోడ్డుపై కూరగాయల విక్రయాన్ని తక్షణమే నిలిపివేశారు. సీఎస్ఐ మైదానంలో కూరగాయల విక్రయానికి రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విషయమై ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రైతులకు ప్రమాదం పొంచి ఉన్న విషయంపై తైబజార్ వాళ్లతో మాట్లాడినట్లు తెలిపారు. బిజీ షెడ్యూల్ వల్ల నేరుగా వెళ్లలేకపోయానని, ఫోన్ ద్వారా సమస్య పరిష్కరించినట్లు పేర్కొన్నారు.




## దోమల నిర్మూలనపై నిర్లక్ష్యం చేయవద్దు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డెంగీ రాకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు ఉంటుందని హెచ్చరించారు. జ్వరం, తీవ్ర జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కళ్ల వెనుక నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. డెంగీ లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సొంత వైద్యం చేసుకోవద్దని కోరారు. ఈ మేరకు ప్రజలను చైతన్యం చేసేందుకు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపడుతున్నట్లు వైద్య అధికారులు తెలిపారు. ప్లేట్‌లెట్లు తగ్గినప్పుడు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని, ఆలస్యం చేస్తే ప్రాణాపాయం ఉంటుందని హెచ్చరించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కూలర్లు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు ఉండకుండా ప్రతివారం శుభ్రం చేయాలని ఆయన సూచించారు. డెంగీ దోమ పగటిపూట కుడుతుందన్నారు. పూర్తి చేతుల దుస్తులు ధరించాలని, దోమ తెరలు వాడాలని అవగాహన కల్పించారు.

## నగర శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగర శివారులోని దుబ్బ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఈ మేరకు నిజామాబాద్ మూడో టౌన్ పోలీసులు వివరాలు వెల్లడించారు. దుబ్బ ప్రాంతంలోని కేవీస్సీ వైన్స్ సమీపంలో కాలూర్ రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే స్పందించిన వారు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. అతడి ఒంటిపై ఎలాంటి దుస్తులు లేకపోగా కుడి చేయి మణికట్టుకి ఎరుపు పసుపు రంగుల కంకణాల దారం మాత్రమే ఉంది. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టుగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాల కోసం మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని వారు కోరారు.


## పెట్రోల్, డీజిల్ ధరలపై పన్నులు ఎత్తివేయాలి




**అక్షరటుడే,కోటగిరి:** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై పన్నులు ఎత్తివేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆటోను తాళ్లతో లాగుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, మండల కార్యదర్శి ఏ.విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నిక సందర్భంగా పెట్రో ధరలు పెరగవని చెప్పిన ప్రధాని ఫలితాలు వచ్చాక పెంచడం దుర్మార్గమన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు పెంచి పేదలపై ప్రత్యక్ష భారాలు మోపడం సరికాదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు నల్ల గంగాధర్, నీలి శంకర్, రాజు, రాములు, హన్మాండ్లు, అన్సార్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రాహత్ స్కీంకు అన్ని ఆస్పత్రుల సహకారం ఉండాలి..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎం రాహత్ స్కీంకు జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల నుంచి పూర్తి సహకారం ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఏసీపీ మస్తాన్ అలీ అన్నారు. ఈ మేరకు జిల్లాలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఐఎంఏ హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ స్కీంలో ప్రతి యాక్సిడెంట్ బాధితులకు కేంద్ర ప్రభుత్వం నుండి రూ.1,50,000 వరకు లేదా ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ విశాల్, జిల్లా సెక్రటరీ సృజన్, జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ శశాంక్ రెడ్డి, వివిధ ఆస్పత్రులు సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యావారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 'లో భాగంగా విద్యా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మకత, పోటీతత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా కళాశాలలో ఏఐటూల్స్ టీఎస్‌కేసీ మెంటర్ రాజు ఆధ్వర్యంలో కళాశాలలో వర్క్ షాప్ జరిగింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, శంకరయ్య, అధ్యాపకులు, శివ కుమార్, నాగానిక, అరుణ్ కుమార్, సిద్ధు రాజు, కృష్ణప్రసాద్, గోదావరి, చంద్రకాంత్ శశిధర్, సంతోష్, దశరథ్, కిరణ్ కుమార్, మహమూద్, హరికృష్ణ, వరుణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.